




గత పది సంవత్సరాలుగా, ప్రపంచవ్యాప్తంగా ఉన్న లక్షలాదిమంది తెలుగువారిని అలరిస్తున్న కిరణ్ ప్రభ టాక్ షోలు, యు ట్యూబ్లో 900 పైగా ఉన్న విషయం కౌముది పాఠకులకు తెలుసనే అనుకుంటున్నాము. కొంతమంది పాఠకులు ఆ టాక్ షోలకు అక్షరరూపం ఇస్తే బాగుంటుందని అడుగుతున్నారు. వారి సూచనలమేరకు ఆ టాక్ షోల నుంచి ఎంపికచేసిన కొన్నింటిని నెలనెలా ఇలా అక్షరరూపంలో మీకందిస్తున్నాము.

# చలం జీవితం – సాహిత్యం

## -7-

★విశ్వసించేవారికి పాఠక హృదయ పీఠాధిపతి. విమర్శించే వారికి వనమెల్లా చెరచే తాచెడ్డ కోతి.

★ఎందరికో తిరుగుబాటు చలం. కొందరికి తిరుగుబోతు చలం.

★అభిమానులందరికీ స్వేచ్ఛా ప్రణయ దీపధారి. నచ్చనివారికి అయోమయంలో దారితప్పిన బాటసారి.

★ఎవరేమనుకున్నా, ఏదేమైనా.. "నేను నమ్మిందే బాట. నిండు నిజాయితీనే నా మాట." అని స్వేచ్ఛగా, స్వచ్ఛంగా ప్రకటించి, ప్రచురించి, జీవించి, నిరూపించిన చలం. గుడిపాటి వెంకట చలం. రాసిన వందేళ్ళ తరవాత కూడా సంచలనాలకు కేంద్ర బిందువైన సాహిత్యాన్ని గురించిన తర్వాత భాగం...

చలంగారు తన స్వీయచరిత్రలో ఈ ప్రేమ కథలు రాసి ఉండకపోతే, ఈ సంఘటనలన్నీ, ఆ కాలంలోని, ఆయన సన్నిహితులకు తప్ప, మనకెవరికీ తెలిసి ఉండేదికాదు. ఏ మాత్రం బేషజం లేకుండా ఆయన రాసుకున్న వాటి ప్రకారం చలం గారి జీవితంలో చాలామంది స్త్రీలు ప్రవేశించారు. ప్రణయ గాధలు కొనసాగించారు. వివిధ సందర్భాల్లో నిష్క్రమించారు. వారిలో మొదటి స్త్రీ చలంగారి వదిన గారు రంగనాయకమ్మగారే. రెండవ యువతితో పరిచయం, ప్రణయం, కాకినాడ నుండి నిష్క్రమణ. ఇదంతా

కూడా కాకినాడలో 1918 ప్రాంతాల్లో జరిగింది. ఆమె పేరూ, వివరాలూ మాట్లాడుకోవడానికి ముందు కొంచెం ఉపోద్ఘాతం చూడాలి.

దానికోసం కాకినాడ దగ్గరలో వున్న పిఠాపురం నుండి బయలుదేరాలి. పిఠాపురం జమిందారు గారి సంస్థానంలో 1910 ప్రాంతాల్లో దివాన్ గా పనిచేస్తున్న ఒకాయన పేరు "మొక్కపాటి సుబ్బారాయుడు". అతనికి ఇద్దరు తమ్ముళ్ళు. ఒకతను మొక్కపాటి నరసింహ శాస్త్రి. ఇతనే "బారిస్టరు పార్వతీశం" రాసింది. రెండవ తమ్ముడి పేరు మొక్కపాటి రాంమూర్తి. ఈ రాం మూర్తి గారే 1917 నుండి 27 వరకూ చలంగారి జీవితంలో అత్యంత ప్రధానమైన పోషించారు. ఈ మొక్కపాటి రాంమూర్తి గారు చిన్నప్పుడు కాస్త అల్లరి చిల్లరగా తిరిగేవారు. ఆ తరువాత కాకినాడలో చదువుకోవడానికి వచ్చి, బ్రహ్మ సమాజంలో చేరి, వాళ్ళ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవాడు.

ఆ సమయంలో చలంగారికి రాంమూర్తితో పరిచయం జరిగింది. ఆ రాంమూర్తిగారే చలం గారికి మరో గిరజాల జుట్టు భావకవిని పరిచయం చేశారు.ఆ గిరజాల జుట్టు భావకవే దేవులపల్లి కృష్ణశాస్త్రి. ఈ ముగ్గుర్నీ కూడా "బ్రహ్మ సమాజం తీవ్ర వాదులు" అని పిలుస్తుండేవారు. కృష్ణశాస్త్రి గారు ప్రార్ధనా గీతాలు రాస్తుంటే, చలం, రాంమూర్తీ ఇంకా మిగతా సభ్యులు పాడుతూ నగర సంకీర్తనలాగా వెళుతుండేవారు. ఆ సమయానికి ముగ్గురికి కూడా వివాహాలు అయ్యాయి. చలంగారికి మూడు సంవత్సరాల బాబు. రాంమూర్తికి ఒక పసిపాప. కృష్ణశాస్త్రికి ఇంకా పిల్లలు లేరు. కృష్ణశాస్త్రి భార్యను ఇబ్బందులు పెడుతుంటే, అవన్నీ రాంమూర్తి, చలంగారికి చెప్పి, కృష్ణశాస్త్రిని చలంగారి ఇంటికి పిలిపించి కాస్త మందలిస్తుండేవారు. అంత చనువు వుండేది వాళ్ళ మధ్య.

ఇప్పుడు చలంగారి జీవితంలో పెద్ద మలుపు తిప్పిన సౌందర్య రాశిని పరిచయం చేసుకుందాం. ఆ యువతి పేరు "రత్నమ్మ". రాంమూర్తికి స్వయాన మరదలు. వయసు 16,17 సంవత్సరాలు. కాలేజిలో చదువుకుంటోంది. చలంగారి మాటల్లోనే ఈమె గురించి యధాతథంగా..." ముందు ముందు 10, 12 ఏళ్ళు తన త్రోవలో నడిపించిన ప్రతి శృంగార హృదయాన్నీ మండించిన అందమంతా కూడా ఆమెలో అప్పుడప్పుడే వికసించడం ప్రారంభమవుతోంది. అంత నవ యవ్వనవతి. ఆ తరువాత ఆమె జీవించినంత కాలం, ఆమె నడిచిన త్రోవ, ఎదురైన ప్రతి హృదయాన్నీ మండిస్తూ ఆమె జీవన ప్రయాణం కొనసాగింది. దానికి ప్రారంభం ఇదిగో మనం ఇప్పుడు చెప్పుకుంటున్న సమయం. 1917, 18 ప్రాంతాల్లో.

ఏమైందంటే, ఆ అమ్మాయి కాలేజిలో చదువుకుంటున్నది కదా! అప్పుడప్పుడు చలంగారి దగ్గరకు వచ్చి, తెలియని పాఠాలు చెప్పించుకుంటుండేది. చలంగారు అప్పుడు కాలేజీలో ట్యూటరుగా పనిచేస్తున్నారు.

రాంమూర్తి కూడా మిత్రుడే కదా! అని పెద్దగా ఇబ్బంది పడలేదు. ఆ సమయంలోనే రాంమూర్తికి కలకత్తాలో వుద్యోగం వస్తే, ఆయన భార్యతో సహా వెళుతూ, తమ చిన్న పాపని వాళ్ళ అత్తగారి ఇంటి దగ్గరే వదిలేశారు. ఈ రాంమూర్తి వుండేది వాళ్ళ అత్తగారి ఇంట్లోనే. "మా మరదలు నీ దగ్గరకు పాఠాలు చెప్పించుకోవడానికి వస్తున్నది కదా! మేం కొన్ని నెలల పాటు ఇక్కడ ఉండం. నువ్వు కాస్త జాగ్రత్తగా చూస్తూ వుండు"అని చెప్పాడు. అలా ప్రారంభమయ్యింది ఈ కథ.

అప్పుడప్పుడు ఆ అమ్మాయి వస్తుండేది. ఒక్కోసారి ఆ అమ్మాయి తొందరగా వెళ్ళిపోతానని అంటుంటే..చలంగారు "సరే! నేనే మీ ఇంటికి వచ్చి పాఠం చెబుతాను" అని చలంగారు వాళ్ళ ఇంటికే వెళుతుండేవారు. కొన్ని రోజులు వాళ్ళ అత్తగారి ఇంట్లో ఎవరూ వుండేవారు కాదు. ఈ అమ్మాయే చిన్న పిల్లను చూసుకుంటుండేది. అలా మొదలైన ఆ పరిచయం సంబంధానికి దారితీసింది.

చలంగారు చాలా ఆలస్యంగా రావడం ప్రారంభించారు. భార్య రంగనాయకమ్మగారు ఆలస్యం గురించి అడిగేవారు. "పాఠాలు చెప్పడానికి వెళుతున్నాను" అనేవారు.

"అయితే ఆమెను ఇక్కడికే రమ్మనమనొచ్చు కదా!"

"లేదు. అక్కడ చిన్నపిల్ల వుంది కదా! ఏడుస్తుంది. చూసుకోవడానికి ఎవరూ లేరు." అని చెప్పేవారు.

మరి ఎంతకాలం ఇలాంటివి దాగుతాయి. మొత్తానికి ఈ వ్యవహారం భార్య రంగనాయకమ్మ గారికి తెలిసిపోయింది. కొన్ని రోజులు పోయాక అడిగింది. కాస్త నవ్వుతూ ఎగతాళిగా " ఏమిటీ మీరు పాఠాలు గాఢంగా చెబుతున్నట్టున్నారు. రోజూ ఆలస్యంగా వస్తున్నారు" అని అడిగేసరికి చలంగారు నవ్వేశారు. ఉన్నట్టుండి ఒక్కసారి ఆమె ఘొల్లుమని ఏడవడం ప్రారంభించారు. చలంగారికి తన వ్యవహారం భార్యకు తెలిసిపోయిందని నిర్ధారణ అయిపోయింది. వెంటనే తను కూడా ఏడవడం ప్రారంభించారు. "నన్ను క్షమించు.నేను తప్పుచేస్తున్నానని తెలుసు. కానీ, నన్ను నేను అదుపులో పెట్టుకోలేక పోతున్నాను.అది నా బలహీనత." అని భార్య దగ్గర ఒప్పుకొని ఏడ్చాను అని రాసుకున్నారు గానీ, ఆ సంబంధాన్ని ఆపెయ్యలేదు.

ఇక ఎలాగూ భార్యకు కూడా తెలిసిపోయింది అనుకున్నారో ఏమో..ఇక మొహమాటం లేకుండా ఎక్కువ సమయం రత్నమ్మ దగ్గరే గడపడం ప్రారంభించారు. యెంత కాలం అని ఆమె భరించగలరు!? కొన్ని రోజులు చూశాక, ఆమె చెప్పారు "మీరు చేస్తున్న ఈ వ్యవహారాలు నాకు నచ్చడం లేదు. మూడు సంవత్సరాల బాబు వున్నాడు.ఈ బాబుని కూడా వదలి, నిర్లక్ష్యం చేస్తూ, ఇష్టం వచ్చినట్టు రాత్రుళ్ళు అక్కడ గడిపి వస్తున్నారు. నేను ఇది చూస్తూ భరించలేను. నేను వెళ్ళిపోతాను" అన్నారు.

కానీ, ఎక్కడకి వెళ్తారు? అప్పటికి కన్నతల్లి చనిపోయింది. తెనాలిలో వున్న అత్తవారింటికే వెళ్ళాలి. నిజంగా అక్కడికే వెళ్ళిపోయారు. వెళుతూ..వెళుతూ..కొడుకు మూడేళ్ళ రవిని తీసుకువెళ్ళలేదు. అక్కడే వుంటే, ఇలాంటి సంబంధాలు మానేస్తారు అనుకున్నారు. కానీ, ఆమె వెళ్ళిపోయాక చలంగారికి మరింత వెసులుబాటు దొరికింది. ఈ పిల్లవాడిని కూడా అక్కడికే తీసుకు వెళ్ళిపోయేవారు. అక్కడ రాం మూర్తి కూతురు చిన్నపాప వుంది కదా! పిల్లలిద్దరూ ఆడుకునేవారు. చలం గారూ, రత్నమ్మల వ్యవహారం అలా కొనసాగుతోంది.

కొన్ని రోజుల తర్వాత ఆయనకే అనిపించిందట "నేను ఏం చేస్తున్నాను?తప్పు చేస్తున్నాను. ఆ అమ్మాయేమో చిన్నపిల్ల. నన్ను చూడమని వెళ్ళాడు రాంమూర్తి. నేను ఇలా చెయ్యడం తప్పుకదా!"అని ఆయనే ఆలోచించుకొని, పశ్చాత్తాపడి, ఒకరోజు చీటి రాసి, రత్నమ్మ దగ్గర వదిలేసి ఇంటికి వచ్చారు. చీటిలో ఏం రాశారంటే..."మనం ఈ సంబంధం కొనసాగించవద్దు. ఇది సంఘానికి ఆమోదయోగ్యం కాదు. నాక్కూడా ఎందుకో ఇది తప్పనిపిస్తోంది." అని. ఆ రాత్రి గడిచింది. మర్నాడు పొద్దున్నయింది. మధ్యాహ్నం కూడా అయింది. ఆ అమ్మాయి వస్తుందేమో గొడవ చేస్తుందేమో.– అని చూస్తూనే వున్నారు. కాలేజిలో వుద్యోగం వుంది. ఏమవుతుందోనని భయం మరో పక్క. అప్పటికి చలం గారి వయసు 23 సంవత్సరాలు వుంటుంది. సాయంత్రం అయింది. అప్పటి వరకూ కూడా రత్నమ్మ దగ్గర నుండి ఏ కబురూ రాలేదు. ఏమీ అర్థం కాలేదు. 'ఎంతో గొడవ చెయ్యాల్సిన మనిషి ఏమిటి ఏరకమైన స్పందనా లేదు'అనుకున్నారు. ఈయనకే అనుమానం వచ్చి, రత్నమ్మ ఇంటికి వెళ్లారు. అక్కడ దృశ్యం ఎలా వుందంటే...

ఆ చిన్న పాప కింద కూర్చొని ఏడుస్తున్నది. పాల సీసా పీక పాప నోట్లో వుంది. రత్నమ్మ మంచం మీద పడిపోయి వుంది. చలంగారు వెళ్లి మీద చెయ్యి వేశారు. ఒక్కసారిగా లేచినట్లుగా లేచి, ఆయనమీద విరుచుకుపడి పోయింది. ఏమిటా అని ఆశ్చర్య పడ్డారు. అప్పుడు ఆమె అంది "చలం నేను విషం తాగేశాను. చచ్చిపోబోతున్నాను."

"ఎందుకలా చేశావు?" అన్నారు. "నిన్ను చూడకుండా నేనెందుకు బ్రతికి. నాకు భయం వేస్తోంది. నన్నువదలకండి."అంది. చలంగారికి జరిగిన విషయం అర్థమయింది. ఇంట్లో ఉన్న ఉప్పు నీళ్ళు తాగించి, డాక్టర్ దగ్గరకు తీసుకువెళ్ళి, విషానికి విరుగుడు ఇప్పించారు. మొత్తానికి ప్రాణాపాయం తప్పింది. ఇంత జరిగిన తరువాత రాంమూర్తికి చెప్పకపోతే బాగుండదు – అనుకొని జరిగిన విషయాలు వుత్తరం రాశారు.

రామమూర్తిగారు హడావుడిగా కలకత్తా నుండి వచ్చేశారు. రాగానే చలం గారు ఎదురెళ్ళి జరిగిన సంఘటనలన్నీ పూసగుచ్చినట్లు చెప్పారు. మరి ఆయన విని ఊరుకోలేదు కదా! చాలా కోపం వచ్చింది. "చూడూ! నువ్వేదో పెద్ద మనిషివని నిన్ను గార్డియన్ వుంచి వెళితే, నువ్వింత పని చేస్తావా? అభం శుభం తెలియని చిన్న పిల్లని లొంగదీసుకున్నావు."అని చలాన్ని తిట్టాడు. తిట్టడమే కాకుండా, ఆ విషయాన్ని అప్పటి వరకూ వాళ్ళు పనిచేస్తున్న బ్రహ్మ సమాజం సభ్యులకు ఉత్తరాల ద్వారా తెలియజేశాడు. అప్పటికే చలంగారు రత్నమ్మతో ఎక్కువ సమయం గడపడం వల్ల, బ్రహ్మ సమాజం కార్యక్రమాలు తగ్గించారు. దానికి తోడు ఈ ఉత్తరాలు. దాంతో, బ్రహ్మ సమాజం వాళ్ళు చలం గారిని వెలివేశారు. ఇంత హడావుడి జరిగాక ఇక ఆ వూర్లో వుండడం మంచిదికాదు. అనుకొని ఉద్యోగానికి రాజీనామా ఇచ్చేశారు. అయితే, ఆయనకు అప్పుడు తెలియని విషయం, తరువాత 2,3 ఏళ్ళకు తెలిసింది. అదేమిటంటే...

రాంమూర్తి అంత హడావుడిగా కలకత్తా నుండి రావడానికి కారణం ఏమిటంటే...ఆయనకు కలకత్తా వెళ్ళడానికి ముందు నుండే మరదలితో సంబంధం వుంది. బహుశా ఆమెకు జరగరానిది జరిగి, గర్భవతి అయిందేమో అనుకొని పరిగెత్తుకుంటూ వచ్చారు. కానీ, ఆయన కన్నా ముందే చలంగారు ఎదురెళ్ళి, తన విషయం చెప్పడంతో, రాం మూర్తి తన విషయం చెప్పలేదు. దాంతో రాంమూర్తి కోప్పడడం, చలం గారు వెళ్ళిపోవడం జరిగాయి. మొత్తానికి ఏదైతేనేం, చలం గారు ఎక్కడకు వెళ్ళాలా అని ఆలోచించారు. రాజమండ్రిలో "టీచర్స్ ట్రైనింగ్ కోర్స్" అని ఒకటుంది. బి.ఏ. తర్వాత బి.యి.డి లాంటిది. అందులో చేరడానికి భార్యనీ, కొడుకు రవినీ తీసుకొని రాజమండ్రి వెళ్లారు. రాంమూర్తీ, రత్నమ్మా కాకినాడలోనే వుండిపోయారు. అయితే, వాళ్ళిద్దరి కథా అంతటితో ముగియలేదు.ఆ తరువాత మరో 2,3 సంవత్సరాల తర్వాత చలంగారి జీవితంలోకి ప్రవేశించారు. అదంతా తరవాత తెలుసుకుందాం.

దాదాపు అదే రోజుల్లో వీరేశలింగం గారు చనిపోయారు. ఆయనకు పెద్ద తోట వుండేది. ఒక బంగాళా, అనాధ శరణాలయం కూడా వుండేవి. ఆ బంగాళాలో ఒక గదిని అద్దెకు తీసుకొని భార్యా, బాబుతో అక్కడ దిగడానికని ఏర్పాట్లు చేసుకుంటుండగా, అక్కడ ఉన్న కాకినాడ వాసులకు తెలిసింది చలం వస్తాడని. నిజానికి మొదట్లో రాజమండ్రిలో వున్న బ్రహ్మ సమాజం వాళ్ళు చాలా సంతోషించారు. "చలం వస్తున్నాడు. చురుగ్గా పనిచేస్తున్నాడు."అని. కానీ. "చలం శిఖరాల నుండి జారి అవినీతి బురదలో పొర్లుతున్నాడని వాళ్లకి ఇంకా తెలియలేదు"అని ఈ మాటలు చలంగారే రాసుకున్నారు. "ఈయన పులి లాంటివాడు. గొర్రెల మంద మధ్యన ఉండడానికి వీల్లేదు"అనుకొని, వీరేశలింగంగారి భవంతిలో

ఉండడానికి వీల్లేదని, అద్దెకిచ్చే అతని మీద ఒత్తిడి తెచ్చారు. చలంగారు ఇంకా సామాన్లు సర్దుకోక ముందే వెళ్లి పొమ్మన్నారు.

అప్పుడు సామానంత ఒక పక్కగా సర్దుకొని, వరండాలో కూర్చొని అనుకొన్నారట ' ఏతావునరా నిలకడ నీకు చలం'అని. అలా మనసులో అనుకొంటుండగా..ఆయన మెడమీద ఒక చెయ్యి పడింది. ఒక ఆత్మీయమైన స్పర్శ. తలెత్తి చూశారు. "నూనె రాసి దువ్వని జుట్టు. ముఖం మీదా, మెడమీదా ఎగురుతోంది. సంతోషంతో పొంగే కళ్ళు. దిగులు మసకలో నా వంక చూస్తున్నాయి. మెడలో నగలేక తన సహజ సౌందర్యంతో, మాసిపోయిన బెంగాలీ చీరతో నిలుచుంది." ఎవరు? ఒక పెద్దావిడ.ఆమే చలం గారి మేనత్త. పేరు "మహాలక్ష్మమ్మ". "అబ్బత్త" అని తన ఆత్మకథలో రాసుకున్నారు. ఈ అబ్బత్త ఎవరు? రాజమండ్రిలో అక్కడకి ఎలా వచ్చారు? చలం గారు అక్కడ నుండి బయటకు వెళ్లి పోదామని అనుకుంటుంటే, సరిగ్గా అప్పుడే ఎలా వచ్చారు? అనే విషయాలు తెలుసుకునే ముందు. అసలు ఈ అబ్బత్త గారి నేపథ్యం గురించి తెలుసుకుందాం...

చలంగారి నాన్న గారికీ, వాళ్ళ పెదనాన్న నరసింహారావు గారికి, ఒక చెల్లెలు వుంది. ఆమె పేరే ఈ 'మహా లక్ష్మమ్మ'. ఈమెకు చిన్నప్పుడే పెళ్లి చేసారు. బాల్య వివాహం అవ్వడంతో భర్త మరణించాడు. ఆమె బాల వితంతువుగానే మిగిలిపోయింది. ఆ రోజుల్లో బాల వితంతువుగా మిగిలిపోయిన వాళ్లకు వివాహం చెయ్యాలంటే, చాలా నిబంధనలు ఉండేవి. వీరేశలింగంగారు అందర్నీ ఒక త్రోవకు తీసుకు వస్తుండేవారు. చలంగారి పెదనాన్నగారు వితంతువైన చెల్లెల్ని తీసుకొని, ఇంట్లో వాళ్ళు వద్దన్నా వినకుండా, రాజమండ్రిలోని వీరేశలింగంగారి శరణాలయంలో చేర్పించారు. ఆమె అక్కడ ఉంటుండగా... వీరేశలింగంగారి మద్దతుదారుగా న్యాపతి సుబ్బారావుగారని ఒకాయన ఉండేవాడు. ఆయన ఈ శరణాలయానికి సంబంధించిన వ్యవహారాలన్నీ చూస్తుండేవాడు.

ఆయనతో పాటుగా ఆయన తమ్ముడు న్యాపతి శేషగిరిరావుగారు కూడా వస్తుండేవారు. ఈయన పెద్ద ఆఫీసరు. మంచి స్థితిలో వున్నారు. అలా వస్తున్నప్పుడు ఈ మహా లక్ష్మమ్మ గారిని చూశారు. ఆమె " భయంకరమైన సౌందర్య రాశి" ఈ మాట చలం గారే రాశారు. అతను ఈ మహాలక్ష్మమ్మను "వివాహం చేసుకుంటా"నని వీరేశలింగం గారికి చెప్పారు. అయితే, ఆ వివాహం చేసుకోవడం వాళ్ళ అన్నయ్య న్యాపతి సుబ్బారావు గారికి ఇష్టం లేదు.

“మా తమ్ముడు మహా లక్ష్మమ్మ గారిని వివాహం చేసుకుంటానని అంటున్నాడు. అది నాకు ఇష్టం లేదు. ఒకవేళ బలవంతంగా మా తమ్ముడికి పెళ్లి చేస్తే మాత్రం, ఇకపై నా మద్దతు వుండదు. మీ సంఘ కార్యక్రమాలలో పాల్గొనను” అని వీరేశలింగంగారితో చెప్పారు.

అయినా కూడా వీరేశలింగంగారు వినలేదు. ఆయన చేపట్టిన కార్యక్రమాలపట్ల, యెంత దీక్షా, క్రమశిక్షణా వుండేది అనడానికి ఇది ఒక ఉదాహరణ. తనకి సహాయం చేస్తున్న మిత్రుడ్ని కూడా వదులుకున్నారు. ఆ విధంగా చలంగారి మేనత్తకూ, న్యాపతి శేషగిరిరావు అనే పెద్ద ఆఫీసరుతో వివాహం అయ్యింది. ఇది ఆమెకు ద్వితీయ వివాహం. ఆమెకు మొదటి వివాహం నుండి కూడా చాలా ఆస్తి వచ్చింది. భర్త ఆఫీసు పనుల మీద వెళుతున్నప్పుడు ఆయనతో కలసి దేశమంతా తిరుగుతూ వుండేది. ఆ రోజుల్లో చాలామంది ఆమెను చూడడానికి ఏదో పనిపెట్టుకొని న్యాపతి శేషగిరిరావు గారి దగ్గరకు వస్తుండేవారట. ఒకసారి రైల్లో వెళుతుంటే..ఈమెను చూడడానికని చాలామంది గుమికూడి ఉండిపోయారట. గార్డ్ వచ్చి, వాళ్ళందరినీ వెళ్ళగొట్టి, దూరంగా నిలుచొని ఆయన చూడ్డం ప్రారంభించాడట. ఆమె అంత అందగత్తె.

అయితే, కొన్నాళ్ళకి ఆ న్యాపతి శేషగిరిరావు గారు మరణించారు. దాంతో ఆమె రెండవసారి వితంతువు అయ్యింది. అసలే అద్భుత సౌందర్యరాశి. దానికితోడు ఇద్దరు భర్తల నుండి ఆస్తి వచ్చింది. ఆస్తి వుంది. అందం వుంది. వయసు వుంది. కానీ, బంధువులు ఎవరూ ఆమెను ఇంట్లోకి రానివ్వలేదు. మరి ఏమయ్యిందో ఏమో గానీ, ఆస్తి ఉండడంతో రకరకాల వ్యక్తులు పరిచయం అయ్యి, ఆమెను మద్రాస్ తీసుకువెళ్ళారు.అలా ఆమె మద్రాస్ లో వున్న రోజుల్లోనే చలం గారు కూడా అక్కడే బి.ఎ. చదువుతుండే వారు. ఒకటి, రెండు సార్లు మేనత్తని చూడ్డానికి వెళ్లారు కూడా.

ఆమె మద్రాస్ లో ఉండగానే, ఒక బెంగాలీ అతను “నేను పెళ్లి చేసుకుంటాను”అని కలకత్తా తీసుకెళ్ళాడు. ఆ బెంగాలీ వ్యక్తి జమిందారు లాంటి వాడు. ఈమె దగ్గర ఆస్తి వున్నదని తెలుసు. అక్కడకు తీసుకెళ్ళి ఎక్కడో దూర ప్రదేశంలో ఒక బంగాళాలో ఉంచాడు. అంత వరకు బాగానేవుంది. బాగానే చూసుకుంటున్నాడు అనుకుంది. కొన్నాళ్ళ తర్వాత ఏవో పేపర్లు తేవడం, వాటిమీద సంతకాలు పెట్టమని అడగడం చేసేవాడు. అంతే, కాకుండా ఈ అబ్బత్త దగ్గర ఒక అమ్మాయి వుండేది. ఆమె పేరు “కమల”. “ఆమెని కూతురు అని చెప్పేది. ఆమె కన్న కూతురా, పెంచుకున్న కూతురా?అనేది తెలీదు.” అని రాశారు చలంగారు. మొత్తానికి ఏమైతేనేం కూతురు వుండేది.

ఆమెకు యుక్త వయసు వచ్చాక, ఈ బెంగాలీ అతను ఆ అమ్మాయి మీదకూడా అత్యాచారం చెయ్యబోయాడు. ఇంక ఈవిడ భరించలేక వీరేశలింగం గారికీ, రఘుపతి వెంకటరత్నం నాయుడు గారికీ

వుత్తరాలు రాసింది."న్యాపతి శేషగిరిరావు గారు చనిపోయాక, ఇక్కడకు వచ్చి, తప్పు చేశాను.కానీ, ఇక్కడ నా పరిస్థితి దుర్భరంగా వుంది. మీరే ఏదైనా చెయ్యండి. నన్ను ఇక్కడ నుండి బయటకు రప్పించే మార్గం చూడండి" అని రాసింది. ఆమె వుత్తరం రాసిన కొన్నాళ్ళకి ఒక పోలీసు ఆఫీసరు వచ్చి, ఆమెనూ, ఆ కమలనూ అక్కడనుండి విడుదల చేశాడు. ఆమెకు రావలసిన నగలూ, మిగతావీ ఇప్పించేసి, వెనక్కి పంపించేశారు. మళ్ళీ రాజమండ్రి వచ్చేసింది.

అలా వచ్చేసి వీరేశలింగం గారి శరణాలయంలో ఉంటుండగా, రఘుపతి వెంకట రత్నం నాయుడు గారు ఆమె నగలన్నీ తనదగ్గర వుంచుకొని "మీ దగ్గర వుంటే, ఎవరో ఒకరు తీసుకెళ్ళిపోతారు. మీ అమ్మాయి పెళ్ళికి ఉపయోగ పడతాయి.నా దగ్గర ఉంచుతాను" అని మంచి ఉద్దేశ్యంతోనే అన్నారు. ఆ పరిస్థితిని వర్ణిస్తూ, చలంగారు వ్రాసింది " వాళ్ళందరి ద్రుష్టిలోనేను బహు పాపిని. నా సౌందర్యమే నా పాతకం. నేను చేసిందేమిటి? నా మొదటి భర్తను నేను చచ్చిపొమ్మన లేదు. నా రెండో భర్తను నేను చంపలేదు. తరవాత మళ్ళీ పెళ్లి కావాలని నేను అడగలేదు. నా పేరు ఎత్తితే మూడు పెళ్ళిళ్ళు చేసుకున్నావని అందరూ నన్ను తిడుతూ వుంటారు. మన బంధువుల్లో నువ్వు తప్ప నన్ను పలకరించే వారు లేరు." అని తన బాధంతా చలానికి చెప్పుకుంది. ఎప్పుడూ? చలంగారు సామానంత సర్దుకుని వరండాలో కూర్చున్న సమయానికి తర్వాత.

ఆ అబ్బత్త, ఆరోజు మెడ మీద చెయ్యి వేసి,"బాబూ! ఏమిట్రా ఇక్కడున్నావు? ఏమైంది?"అంది. చలంగారు "నేను ఇక్కడకు చదువుకోవడానికి వచ్చాను. నన్ను ఎవరూ ఇక్కడ ఉండనివ్వడం లేదు"అన్నారు.

"ఫరవాలేదు. నీకేం భయం లేదు. మాతో పాటు ఉందువు గానీ రా!" అని వీరేశలింగం గారి తోటలోనే ఒక పశువుల పాక లాంటిది వుంటే అక్కడకు తీసుకెళ్ళారు. అక్కడ ఒక పక్క పశువులు వున్నాయి. మరో ప్రక్క చిన్న దడి లాంటిది కట్టి, అక్కడ ఈ అబ్బత్తా, కూతురూ వుంటున్నారు. అక్కడకు తీసుకెళ్ళి, "మాకేమీ నువ్వు బరువు కాదురా! చలం. నువ్విక్కడ వుండి చదువుకో" అన్నారు. కాకపోతే అక్కడ చిన్న గది అవ్వడంతో, సౌకర్యంగా ఉండదని, భార్యనీ, రవినీ పంపించేశారు. ఆ ట్రైనింగు స్కూల్లో వుండగా మరో యువతి వచ్చింది. ఆమె ఎవరో కాదు. వదిన రంగనాయకమ్మ గారు. ఎప్పుడో చలంగారు మద్రాస్ లో వుండగా "నాకు మెడిసన్ చెప్పిస్తావా చలం"అని అడిగిందని చెప్పుకున్నాం కదా! ఆమె ఇక్కడకు వచ్చారా? ఆమెకు ఏం జరిగింది?

విజయవాడలో ఆమె నాన్న గారు, భార్య చనిపోయాక, అంటే చలం అత్తగారు చనిపోయాక, ఆయన మూడో వివాహం చేసుకున్నారు. ఆ మూడవ భార్య, భర్తతో ఉండలేక వేరే ఎవరితోనో వెళ్ళిపోయింది. చలంగారి మామ గారిని ఎవరో మందు పెట్టి చంపేశారు. దాంతో చలంగారి వదిన రంగనాయకమ్మ గారు అనాధ అయిపోయారు. ఎవరో బంధువులు కల్పించుకొని ఆస్తికోసం ఆమెతో కోర్టులో కేసు వేయించారు. కోర్టు "ఈ అమ్మాయికి భరణం ఇవ్వాలని" తీర్పు చెప్పింది. "భరణం నెలకు ఇరవై రూపాయిలు ఇస్తాం నువ్వు ఎక్కడికైనా వెళ్ళిపో"అన్నారు ఆస్తి కాజేసిన వాళ్ళు.

ఆ నేపథ్యంలో వదిన రంగనాయకమ్మ గారు, రాజమండ్రిలో చలం ఉన్నాడని తెలిసి, వచ్చారు. "చలం! నువ్వు ఎక్కడా అని అడిగితే ఎవ్వరూ చెప్పలేదు. కొంతమంది విసుక్కున్నారు. కొంతమంది అసహ్యించుకున్నారు." అందామె. మొత్తానికి వీరేశలింగం గారి తోటలో, పశువుల పాకలో ఉంటున్నాడని తెలుసుకుని అక్కడకు వచ్చారు. ఆమెను తీసుకెళ్ళి మేనత్తకు చూపించారు. ఆమెను అంతకుముందే తెలుసు. ఆమె సాదరంగా ఆహ్వానించి, "సరే! అమ్మాయి రా! ఇక్కడుండి చదువుకుందువు గాని" అన్నారు. అక్కడే ఆ చిన్న పాకలోనే నలుగురూ వుండేవారు. చలం గారూ, అతని మేనత్తా, ఆమె కూతురూ, ఇప్పుడు వచ్చిన వదిన రంగనాయకమ్మ గారూ.

వదిన రంగనాయకమ్మగారిని అక్కడే స్కూల్లో నాలుగవ ఫారంలో చేర్పించారు. ఈయన L.T.E. ట్రైనింగు కాలేజీ వెళ్లి వస్తుండేవారు. ఆమెకు చదువు కూడా చెబుతుండేవారు. అయితే, అది అంతటితో ఆగలేదు. ఈ వదినగారు, అంతకుముందే స్నేహితురాలు. ఇద్దరూ కలసి ఆ తోటల్లో షికార్లు చేస్తుండేవారు. వీరేశలింగం గారి తోట చాలా పెద్దది. బోలెడన్ని ఫల వృక్షాలూ, పూల మొక్కలూ ఉండేవి. ఆ మేనత్త పెట్టినదేదో తినడం,ఆమె స్కూలుకీ, అతను కాలేజీకీ, సాయంత్రాలు తోటలో విహారాలు ఇలా నడుస్తున్నాయి రోజులు.

ఒకరోజు ఈయన చదువుకునే స్కూలు ప్రిన్సిపాలు అన్నాడట " చలం ఏమిటయ్యా! ఆ బట్టలు. వాసన వస్తోంది. బట్టలు మార్చుకొని రా.."

దానికి చలం గారు అమాయకుల్లాగా..." బట్టలు మార్చాలా..ఏం?ఎట్లా మార్చాలి?"అన్నారట.

"నాకదంతా ఏమీ తెలీదయ్యా..నువ్వీ బట్టలు వేసుకొనిరాకు. పిల్లలు చూడలేకపోతున్నారు నిన్ను" అని ఆయన కొంచెం చీదరించుకున్నట్లు మాట్లాడట. అయినా గానీ ఆయనేమీ పట్టించుకోలేదు. చలంగారికి నెలకు 15 రూపాయలు వచ్చేవి. "అయినా...మేనత్త కు ఏమైనా ఇద్దాము. అన్న ఆలోచనకూడా రాలేదు నాకు"అన్నారు. ఒకరోజు వాళ్ళింట్లో భోజనం చేస్తుంటే "బావా! ఈ రోజు కూర వండలేదు. ఈ చారూ,

మజ్జిగే" అంది కమల. తరవాత వదిన రంగనాయకమ్మ గారు చెప్పారు. "వాళ్ళింట్లో అన్నీ అయిపోతున్నాయి. మనం ఏమీ ఇవ్వడం లేదు కదా! ఇంట్లో పాత్రలు అమ్మేసి, మట్టి పాత్రల్లో చేస్తున్నారు.నువ్వేమీ పట్టించుకోవడం లేదు." అని. చలం గారికి సిగ్గేసినట్లనిపించి...అబ్బత్త తో చెప్పారు." నేను కొంచెం డబ్బులు ఇస్తాను.ఇంత కాలం ఇవ్వలేదు. నువ్వేమో నీకున్న దాంట్లోనే వండి పెడుతున్నావు."
"వద్దురా! మేనల్లుడికి ఆ మాత్రం వండి పెట్టలేనా?" అందామె.
"నా ట్రైనింగ్ అయిపోయాక, నా దగ్గర పెట్టుకొని నిన్ను సుఖంగా చూసుకుంటాను" అని అన్నారు. తరవాత రోజుల్లో అది నిజం అయ్యింది. ఆమెకు చాలా సహాయం చేశారు. అదంతా తర్వాత చూద్దాం. అలా కొన్నాళ్ళు అయ్యాక "చలం! ఇక మిమ్మల్ని చూడలేను. ఎందుకంటే, నా బ్రతుకే నాకు కష్టంగా వుంది" అన్నారు. అలా చెప్పేసరికి అక్కడ నుండి ఖాళీ చేసేసి, చలం గారూ, వదిన రంగనాయకమ్మ గారూ మాల పేటలో ఏదో గుడిసె ఖాళీగా వుంటే, ఆ గుడిసెలోకి వెళ్లారు. అక్కడకు వెళ్ళడానికి ఎంతసేపు పట్టింది? రెండు సామాన్లూ, కొద్ది పుస్తకలూ అంతే. అప్పుడే భార్య రంగనాయకమ్మ గారు వుత్తరం రాశారు. "రవిని పంపిస్తున్నాను. నీ దగ్గరే ఉంచుకో.."అని. ఆ రవి అప్పటికి 4,5 ఏళ్ళ పిల్లవాడు. ఆ గుడిసెలోనే ఆ పిల్లవాడితో సహా వుండేవారు. ఆ విధంగా ఆయన రాజమండ్రిలో ట్రైనింగ్ పూర్తి చేశారు. వదిన గారు కూడా నాలుగో, అయిదో ఫారాలు పూర్తి చేశారు.

ఆ చదువు అయ్యాక ఏం చెయ్యాలి? ఎక్కడకు వెళ్ళాలి? మళ్ళీ ఏదైనా వుద్యోగం వెతుక్కోవాలి. తనకి తనైతే ఏదో పది రూపాయలు తెచ్చుకొని, రాజమండ్రి లోనే వుండేవారు. కానీ, వదిన గారేమో, నాకెలాగైనా వైద్య వృత్తి నేర్చుకోవాలని వుంది" అని అడగడం.. అటువైపు భార్య కూడా "ఎక్కడో ఒక చోట స్థిరమైన వుద్యోగం చూడు. బాబు పెద్దవాడవుతున్నాడు. తరవాత కూడా భవిష్యత్తులో పిల్లలు పుడతారు. నువ్వు ఇలా అల్లరి చిల్లరిగా వుంటే, స్థిరత్వం వుండదు." అనేసరికి, ఎలాగైనా సరే, వుద్యోగం చూసుకోవాలనిపించింది.

తాత్కాలికంగా ఎక్కడికైనా వెళ్ళాలి కదా! తెనాలి వెళ్లారు. అక్కడకు వెళ్లేసరికి వాళ్ళ నాన్నగారు "నువ్వు భ్రష్టుపట్టిపోయావు. ఇలాంటి పనులు చేసేవారు మా ఇంట్లో ఉండడానికి వీలులేదు. నువ్వు బయట ఎక్కడైనా వుండు." అనే సరికి భార్యా, పిల్లలూ, వదిన గారిని తీసుకొని తెనాలిలోనే ట్రావెలర్స్ బంగాళా వుంటే, తాత్కాలికంగా అక్కడ వున్నారు. ఎన్ని అవమానాలు జరిగినా గానీ, ఎన్ని బహిష్కరణలు జరిగినా గానీ ఆయన నమ్ముకున్న మార్గాన్ని విడువలేదు. ఆ సమయంలోనే కర్ణాటకలోని హోస్పేటలో కొత్తగా ఒక స్కూలు కట్టారు. "ఇక్కడ హెడ్ మాస్టర్ పోస్ట్ ఖాళీగా వుంది. ఎవరైనా మంచి కుర్రాడు

వుంటే, పంపించండి.” అని రాజమండ్రి ట్రైనింగు కాలేజీకి రాశారు. వాళ్ళు చలం గారిని సిఫారసు చెయ్యడంతో, చలం గారు ‘హోస్పేట’ ప్రయాణమయ్యారు.

ఆ హోస్పేటలో వదిన గారు చదువుకోవడానికి అవకాశాలు లేవు. కాబట్టి, ఎక్కడైనా వుంచి చదివిద్దామని అన్వేషణ ప్రారంభించారు. ఆయనకు తెలిసింది మద్రాసు. అందుకని హోస్పేటలో 1,2 నెలలు అయ్యాక, జీతం డబ్బులు అందుకొని వదిన గారితో, మద్రాసు బయలుదేరారు ఎక్కడైనా హాస్టల్ లో చేర్పిద్దామని. అక్కడ వున్న హాస్టల్స్ దగ్గరకు వెళ్లి అడుగుతుంటే, మాసిపోయిన దుస్తులూ అవీ,చూసి, ఎవరూ సరిగ్గా సమాధానం చెప్పలేదు. అప్పుడు జరిగినటువంటి సంఘటన ఆయన మాటల్లోనే

”మా దుమ్ముకొట్టిన మొహాలూ, మాసిన బట్టలూ చూస్తే, మా మీద ఎవరికీ నమ్మకం రావడం లేదు. మా దేభ్యం మొహం చూసిన ఒక క్రిస్టియన్ ఆయన “కెన్ ఐ బి హెల్ప్”అన్నాడు. అదేం అదృష్టమో గానీ, కారణం లేకుండా ఎవరు వచ్చినా వాళ్ళు క్రిస్టియన్లే. హిందువులు కల్పించిన ఈశ్వరుడు అనుకోవడానికి సిగ్గుపడతాను. అయితే, మొదట ఈశ్వరుడు పేరు ఎత్తింది యూదులట. నవ్వుతూ, నా స్నేహం కోరి నా దగ్గరకు చేరిన వారందరూ ముసల్మానులే. నేను ఎవర్నో తెలియకుండా ఇంతలో ఏం పోయింది అని ఒక రాయి విసిరిన వాళ్ళందరూ హిందువులే. ముఖ్యంగా బ్రాహ్మలే.”

మొత్తానికి ఎలాగైతేనేం, ఆ క్రిస్టియన్ ఆయన చెప్పిన మీదట, ఒక హాస్టల్ దగ్గరకు తీసుకువెళ్ళారు. “అక్కడైతే ఆడపిల్లలకు సౌకర్యవంతంగా వుంటుంది. డబ్బులు కూడా తక్కువ” అని అక్కడ వార్డెన్ కూడా చెప్పాడు. ఆ హాస్టల్ వార్డెన్ కూడా ఇద్దర్నీ చూసి, “ఏం చదువుకున్నారు, ఏమిటీ?”అని ప్రశ్నించిన మీదట, “సరే!”నని లోనికి తీసుకువెళ్ళి, ఏదో గది చూపించారు. “నెలకు 17 రూపాయలు పంపించాలి” అని చెప్పారు. తను ఎలాగూ వుద్యోగం చేస్తున్నారు కాబట్టీ, “సరే!నేను పంపిస్తాను”అన్నారు. వచ్చేముందు ఆమె అన్నారట ”చలం! ఒకవేళ వీళ్ళు నన్ను క్రిస్టియన్లలో చేరామంటే...చేరనా?”అని.

అప్పుడు చలంగారు అన్నారట. ఆయన ఎంత తీవ్రవాదో, ఆలోచనలు ఎలా ఉండేవో చూడండి.”చేరండి రంగనాయకమ్మ గారూ..మీవెనక నేనూ అవుతాను. హిందూ పీడ వదలిపోతుంది. ఈ హిందూ స్కూళ్ళ ల్లోనూ, గవర్నమెంట్ స్కూళ్ళల్లోనూ, వాళ్ళ చూపులూ,గర్వాలూ నాకు జ్ఞాపకం వచ్చాయి”అని రాసుకున్నారు. ఆమెని అక్కడ చేర్పించేసి, హోస్పేట వచ్చేశారు.

హోస్పేటలో తనూ, భార్యా, కొడుకూ వుంటున్నారు.సరే! బాగానేవుంది. స్కూలు వాళ్ళతో చిన్నచిన్న తగాదాలు మామూలే. ఏం జరిగిందంటే...చేరడానికి వెళ్ళేటప్పుడు అక్కడ దగ్గర్లో వుండే మునిసిపల్ కౌన్సిలర్ కి “నేను జాయిన్ అవుతున్నాను.” అని చెప్పలేదు. దాంతో ఆయనకు కోపం వచ్చింది.

అప్పటినుండి ఎప్పుడు అవకాశం వచ్చినా చలంగారిని ఇబ్బంది పెట్టడం ప్రారంభించాడు. అలా జరుగుతూ వుండగా చలంగారి దగ్గరకు ఒక ఒక పాత మిత్రుడు కాకినాడ నుండి వచ్చాడు. అతని పేరు ప్రకాశం.

ఈ ప్రకాశం ఎవరో కాదు. చలం గారు కాకినాడ వదలి వెళ్ళిపోవడానికి కారణం అయిన రాం మూర్తి వున్నాడు కదా! ఆ రాం మూర్తికి శిష్యుడు లాంటి వాడు. అతను భార్యతో సహా వచ్చాడు హోస్పేటకి.
" రాం మూర్తి పంపించాడు నన్ను. మీరు వచ్చేసిన తరవాత ఏం జరిగిందో తెలుసా?"అన్నాడు.
"నాకేం తెలుస్తుంది? రాజమండ్రి నుండి ఇక్కడకు వచ్చేశాను"అన్నారు.
"మీరు వచ్చేశాక రత్నమ్మ ఒకసారి చెరువులో పడబోయింది. ఎవరో చూసి రక్షించారు. విషయం ఏమిటంటే, "నేను బావ తోనే వుండిపోతాను" అంది. వాళ్ళ అత్తగారూ, అందరూ కూడా నచ్చ చెప్పడానికి ప్రయత్నించారు గానీ, వినలేదు. దాంతోటి వాళ్ళు రాం మూర్తి మీద కేసు వేశారు. "రాంమూర్తి చిన్న పిల్లని, మభ్యపెట్టి లొంగదీసుకున్నాడు" అని. కోర్టు అన్నీ విన్నాక, ఈ అమ్మాయికి మైనార్టీ తీరిపోయింది. మేజరే కనుక, ఆమె నిర్ణయం ప్రకారం ఉండవచ్చు. అని తీర్పు చెప్పారు. రాంమూర్తి అత్తవారు అందరూ.. రాంమూర్తీ, రత్నమ్మలను తిట్టి, ఇంట్లోనుండి పొమ్మన్నారు. వాళ్ళు ఎక్కడో బయట వుంటున్నారు. వుద్యోగం లేదు. బ్రహ్మ సమాజం వాళ్ళు కూడా వెలివేశారు. రాంమూర్తి భార్య చంద్రమతి, పిల్లని తీసుకొని పుట్టింటికి వెళ్ళిపోయింది. వీళ్ళిద్దరూ కాకినాడలో చాలా కష్టంగా వున్నారు. నన్ను మీ దగ్గరకు పంపించాడు. నిన్ను తిట్టినందుకు చాలా పశ్చాత్తాప పడుతున్నాడు. ఇద్దరూ కూడా నువ్వేదైనా సహాయం చేయమని నన్ను అడగమన్నారు"అన్నాడు ప్రకాశం.

తను చేస్తున్న స్కూల్లోనే ఇద్దరికీ ఉద్యోగాలు ఇప్పించారు. దాంతోటి పాత మిత్రులందరూ ఒక చోట చేరారు. అందరూ దగ్గర దగ్గరలోనే వుండేవారు. అప్పటికే చలం గారి భార్య రెండవసారి గర్భవతి. ఆమె కూడా కాకినాడలో జరిగిన విషయాలు మరచిపోయి, ఈ వూరు కాని వూర్లో కాస్త తెలిసిన వాళ్ళు వున్నారు కదాని, అందరితోనూ మంచిగానే వుండడం ప్రారంభించింది. ఆమె గర్భిణీ అయినా కూడా అందరికీ వంటలు చేసి పెడుతుండేది.

అలా వుండగా ఆ హోస్పేట స్కూలు వాళ్ళతో తగాదాలు మొదలయ్యాయి. ఎలాగైనా చలం గారిని స్కూలు నుండి పంపించెయ్యాలని అభిప్రాయ పడ్డారు. కాకపోతే, స్కూలులో ఉన్న పిల్లలందరికీ ఈయనంటే, చాలా ఇష్టం. పిల్లలంతా ఎదురు తిరిగారు. "మా హెడ్ మాస్టర్ వెళ్ళిపోవడానికి వీల్లేదు. ఆయన ఇక్కడే వుండాలి" అన్నారు. దాంతో చలం గారిని స్కూలు నుండి పంపించడం కుదరలేదు.

అప్పుడు వాళ్లంతా కలిసి ఆయన అద్దెకు వుంటున్నటువంటిఇంటి వాళ్ళ మీద ఒత్తిడి తెచ్చి, ఇల్లు ఖాళీ చేయించారు.

ఆ ఊర్లోనే ఒక అగ్రికల్చరర్ ఆఫీసరు ఒకాయన ఉండేవాడు. అతను చలం గారికి మంచి మిత్రుడు. ఆయన చలంగారికి జరుగుతున్న ఈ అవమానాలు చూసాడు. "నేను ఇల్లు ఇప్పిస్తాను రండి"అని వూరికి దూరంగా ఒక అడవి లాంటి ప్రదేశంలోని బంగాళాలో ఒక భాగం అద్దెకు ఇప్పించారు. అది పూర్తి నిర్జనంగా, అరణ్యం లాగ వుండేది. ఏమీ దొరికేవి కావు. అందుకని ఉల్లి పచ్చడీ, చారూ, మజ్జిగ లాంటివి మాత్రమే చేసుకుండేవారు. "అసలు ఆరోజుల్లో దొంగల భయం కూడా పెద్దగా ఉండేదికాదు."అని రాసుకున్నారు చలం గారు.

ఆయన ప్రణయ ధీపదారి అనుకున్నాం కదా! ఆ వ్యవహారాలు అలా కొనసాగుతున్నాయి. దాని గురించి ఆయన చాలా స్వేచ్ఛగా, స్వచ్ఛంగా,బేషజం లేకుండా చెప్పుకున్నారు అనుకున్నాం కదా! "నా బుద్ధి చంచలం. నా మనసూ, హృదయమూ ఒకరి మీద నిలిచి వున్నా ఈ లోపల నావైపు ఎవరైనా చెయ్యి చాచినా, నన్ను చూపుతో ఆకర్షించినా, నిలవలేక ఆమె వైపు పారిపోయేవాడిని. ఈ చాంచల్యం వలన నా ఆదర్శ ప్రేమకు ఏ భంగమూ కలిగినది కాదని అనుకున్నాను.ఈ చాపల్యం చూస్తే,నాకు రోత. ఈ గుణంతో నా జీవితమంతా యుద్ధం చేశాను. ఈనాటికీ యుద్ధం చేస్తూనే వున్నాను. కానీ, నన్ను వదలదు ఈ దోషం. దాంతో ఎన్ని చిక్కుల్లోకి దిగానో. అసహాయమైన పరిస్థితుల్లో ఇరుక్కున్నాను. "అని రాసుకున్నారు.

ఈ సంబంధాలు హోస్పేటలో కూడా కొనసాగాయి. ఎందుకంటే, రత్నమ్మా, రాంమూర్తీ అక్కడే వున్నారు కాబట్టి. అక్కడ అధికారులతో గొడవలు కొనసాగుతున్నాయి. అలా మరో రెండు సంవత్సరాల తర్వాత అక్కడ వుద్యోగం ముగించుకొని, తెనాలి వెళ్ళిపోయారు. ఈ హోస్పేటలో వున్నది 1920, 22 ప్రాంతాలలో. ఆ సంవత్సరాలలోనే కాల్పనిక సాహిత్యం "శశిరేఖ" నవల రాయడం ప్రారంభించింది. తర్వాత ఏం జరిగింది? వచ్చేభాగంలో తెలుసుకుందాం...

(కొనసాగింపు వచ్చేనెలలో)

అక్షరీకరణ – వి. వెంకటరావు

2019 ఫిబ్రవరి 26 న, ప్రసారమైన ఈ టాక్ షోని ఇక్కడ వినవచ్చు

.

COMMENTS